# నామొగుడు తుగ్లక్

పెళ్లినాటికి నామొగుడు పదివేల రూపాయల జీతగాడే. తర్వాత ఆఫీసరయ్యాడు. నా భర్త అదోటైపు! అందరిది ఒకదారయితే వులిపి కట్టె దిమరో దారి అన్నట్టు... లంబోదరం డిఫరెంట్! అన్నీ 'ఓసీ'గానే వచ్చి ఒడిలో వాలాలనుకునే మనస్తత్వం! స్వంత డబ్బుతో కప్పు కాఫీ కూడా తాగడు. ఏదైనా తిన్నా... తాగినా... ఎదుటివారి మీద వాలిపోతాడు. చేసేవన్నీ సిగ్గుమాలిన పన్లే! ఆ మనిషి నాకు అసలు నచ్చడు.

భర్తను అవమానపరుస్తూ మాట్లాడటం సహధర్మ చారిణిగ నాది తప్పే! ఇద్దరం భిన్న ధృవాలమైనప్పుడు విమర్శించటంలో తప్పులేదు. నేనూ ఎప్పుడూ వాస్తవమే మాట్లాడతాను. నామాటలు ఆయనకు నచ్చినా నచ్చకపోయినా తీరు మార్చుకోను.

ఆయనగారు పదిపైసలు ముష్టివేయడు. గుడిలో దైవదర్శనానికి వెడితే దేవుడి 'హుండీ'లో పావలా వెయ్యటానికి మనస్కరించదు.

నాపెళ్లి నాటికి ఆయనకో 'డొక్కు'సైకిలుండేది. అది ఇక్ష్వాకులనాటిది! ఆయనకు తప్పవేరెవరికీ మాట వినదు. అదొక చల్తీకనామ్ గాడీ!

స్కూటర్ కొనుక్కోవయ్యా మగడాని నెత్తీ నోరు మొత్తుకున్నా ససేమిరా! ఒట్టిమొండి ఘటం! టూవీలర్ కొనకపోగా.. షోరూమ్ కెళ్లి ట్రయల్ వెళ్లొస్తానంటూ బేవర్స్‌గా నాలుగైదు కి.మీ. చక్కర్లు కొట్టి నచ్చలేదని మొహమాటం లేకుండా చెప్పేస్తాడు. ఆయనకు అదో సరదా! ఎదుటి వాళ్లు తిట్టిపోస్తారనే సిగ్గయినా లేదు.

ఇదొక మచ్చుతునక మాత్రమే! ఇలాంటి వెధవ పన్లు చేయటంలో ఆయనకు ఆయనే సాటి! ఆయనను మించిన ఘనాపాటి వెరొకరుండరన్పిస్తుంది.

ఒక రోజున... ఆయన ఇంటికొచ్చే సరికి ఇల్లు తాళం పెట్ట వుండటం చూచి మ్యాట్నీ సినీమాకెళ్లి వుంటుందా ఏమిటి చెప్మాని విస్తుపోయాట్ట?... లేక... ఏ వెధవ అయినా పెళ్లాన్ని కిడ్నాప్ చేశాడా?.. అసలే ఆడది... అందునా అందమైనది. అనుకుంటూండగ నేను ఆటో దిగటం చూచి లంబోదరం... అదే నా హజ్బెండ్ నిర్ఘాంతపోయాడు... నా మేకప్... గెటప్... స్టైల్ చూసి

ఇంటి తాళం తీసిలోనికి నడుస్తూ 'లోపలికి రండి' అన్నాను.

ఇదేం పిలుపు 'విటుడ్ని' పిలిచినట్టు అనే భావన ఆయనకుస్ఫురించి వుంటుందనే విషయం గ్రహించి అపోహలేం వద్దు అన్న భావనతో మావారి ముఖంలోకి చూశాను సీరియస్సె!

'ఏమిటే... వండ్రఫుల్ మేకప్‌లో వున్నావ్?... గడ్డం పైన కింది పెదవి చివరగ ఆస్పాటేమిటీ?' తనను తాను సంబాళించుకుని ప్రశ్నించాడు.

'ఇదా!?- బ్యూటీస్పాటండీ...' గలగలా నవ్వాను.

'నువ్వే వరల్డ్ బ్యూటీ!... ఇంకా ఆస్పాట్ అవసరమా?- దిష్ఠి చుక్కేమో అన్పించింది... అవునూ తమరి రాక ఎచటి నుండి?... సినీమా వాళ్లు నీ అందానికి మూర్ఛిల్లి.... హిరోయిన్ వేషమిస్తామంటూ నిన్నులాక్కెళ్లారా ఏమిటి కొంపతీసి?... చెప్పవే భార్యామణి... ఇంతకూ ఎలాంటి వేషం? రెమ్యూనరేషన్ తాలుకు ఎడ్వాన్స్‌గ చెక్ ఇచ్చారా? క్యాషా?...' గుక్క తిప్పుకోకుండా మనసులో మాలిన్యాన్ని కక్కేశాడు లంబోదరం.

'ఆపుదురూ మీ వేళాకోళం...' సిగ్గుపడ్డాను.

'ఎగతాళి కాదే నాచిట్టి చిలకా!... మూడు పదులు దాటి నాలుగో పదికి దగ్గరపడుతున్నా నీ అందం చూస్తుంటే పరులకైనా పిచ్చెక్కకతప్పదు. అందుకే కదా మీ అయ్య... సారీ బాబు... కాదు కాదు మీ డాడీ కట్నం ఇవ్వకపోయినా నిన్ను 'ఒసీ' గా చేసుకున్నది. నేటికైనా నువ్వు ప్రపంచ సుందరి పోటీలో పాల్గొంటే... నీ నెత్తిన వజ్రాలు పొదిగిన బంగారు కిరీటం నీకే డౌటే లేదు... సాదాసీదా సుబ్బారావు లాగ మాట్లాడేడు నామొగుడు.

'అదేంటి మీరు పేరెప్పుడు మార్చుకున్నారు నాకు చెప్పకుండ?-'

'కుండ లేదు ఇత్తడి బిందెలేదు. అదొక వాడుక పదం లేవే పిచ్చి మొహం మా... నీ మెళ్లో మూడు ముళ్లూ వేసింది లగాయితూ నిన్ను కాపాడుకోలేక చస్తున్నాననుకో!... గద్దలా ఎవడైనా... కోడిపిల్ల లాంటి నిన్ను ఎక్కడ తన్నుకుపోతాడోని మనసులో దిగులుపడి చస్తున్నానే బంగారు చిలకా...'

'అబ్బ అపండిమీ డైలాగులు!.. మీరు వూహించుకున్నట్టేం జరగలేదు.... మా ఫ్రెండ్ మాధురి లేదూ... బ్యూటీ పార్లర్ ప్రారంభోత్సవానికి నన్నూ ఆహ్వానించింది. వెళ్లక తప్పలేదు. రిబ్బన్ కటింగ్ అయ్యాక... నాది లక్కీ ముఖార విందమని... 'బోణీ' చేయటానికి... అంటే ఫస్ట్ మేకప్ నాకే వేసింది. అర్ధగంటలో 'ఫేసియల్

చేసేసింది..'

'అదా సంగతి!... అవునూ... 'ఓసీ'గానేనా?... ఫేసియల్ చేసినందుకు చెయ్యి చాచిందా మీ ఫ్రెండు?-' ఎంత నష్టం జరిగిందోని తలపట్టుకుని అక్కడున్న సోఫాలో కుప్పకూలాడు లంబోదరం.

'ఏమండీ.. నా ఐబ్రోస్ ఎంత అందంగ 'కట్' చేసిందో చూడండి... అచ్చంగా సినిమా హీరోయిన్ లాలేనూ?-'

'దానమ్మ మొగుడిలావున్నావ్' పళ్లు నూరాడు.

'అంటే... ముసలమ్మలా అవుపిస్తున్నానా...' బుంగ మూతి పెట్టాను.

'ఓసినీయమ్మ కడుపు కాలిపోను... ఇప్పుడు నీకు ఇవన్నీ అవసరమా?'-

'అదేంటండీ?- నేను ఆఫీసరుగారి వైఫ్ నైనుండి... మేకప్ చేసుకోకుండా.. సీదా సాదాగా వుంటే మీకెంత నామర్దా-' ఎక్కేశాను.

'ఇప్పటికే ఇంత బ్యూటిఫుల్ లైఫ్‌ను ఏరాక్షసుడైనా తన్నుకుపోతాడేమోని దిగులుతో చస్తుంటే... దానికి తోడు మేకప్‌తో వీధిలోకెడితే... నాబతుకు ఎంగిలివిస్తరాకే...' భోరుమన్నాడు.

'చాల్లే ఆపండిమీ అతి!- మీకో విషయం చెప్పాలి. పెళ్లి కూతురు మేకప్ చేస్తే అయిదువేలట!... పిల్లలకైతే అయిదొందలు... పెద్దవాళ్లకు (ముసలివారికి కాదు) ఫేసియల్ చేసినందుకు వెయ్యి రూపాయలు చార్జ్ చేస్తారని మా ఫ్రెండ్ చెప్పింది. నన్నూ బ్యూటీషియన్ ట్రైనింగ్‌కి పంపండీ.... తర్వాత నేనూ పార్లర్ ఓపెన్ చేస్తా.. మంచి ఎర్నింగండీ...'

'అంటే... బార్బర్ షాప్ పెడతానంటావ్?-'

'మీకు అంతా ఎగతాళే.... ఆడవాళ్లు చేసే పన్లను ఎందుకంత 'ఛీప్'గా మాట్లాడతారు?...'

'అవృత్తి నీకేల?- నేను ఐ.టి.ఓను! జీతంకాక ఆదాయం బోలెడంత!... ఇద్దరమేకదా మనం... ఇంకా ఎందుకే ఏదో చేయాలని తాపత్రయం?...'

'ఎర్నింగ్ అనికాకపోయినా... ఏదో ఒక కాలక్షేపంకదుటండీ...'

'నీకు ట్రైనింగ్.. తర్వాత మంచి లోకాలిటీ చూచి ఓషాపు అద్దెకు... బిజినెస్ జరక్కపోతే లాసు! ఎందుకొచ్చిన తంటా?- పైగా... ఆఫీసరు పెళ్లాం సెలూన్ పెట్టిందనేసి అందరూ నవ్వు కోరూ?- మనక్కు అలాంటి ఛీప్ పన్లు వద్దు...' డబ్బు

ఖర్చుపెట్టటానికి మనస్కరించని లంబోదరం తలతిక్క జవాబిచ్చాడు.

నా మొగుడొక తుగ్లక్ కదా? చెప్తే వినడు!... ఇతరులు చెప్పేది నచ్చదు. అంతా తలతిక్క వ్యవహారం మనిషి! గొణుకున్నాను.

'మీరు పిల్లికి బిచ్చం పెట్టరు కదా....' అనేశాను

'ఆహాఁ! అక్కడికి నువ్వొతెగోదారివి. పుట్టింటి వారు ఏమిచ్చారని నువ్వు ఖర్చుపెడతావ్?-'

భర్తదెప్పుళ్లకు వళ్లుమండింది!

నేను బేవర్స్‌గాడినే కావచ్చు!... అన్నీ ఓ.సీగా రావాలనేది నా మనస్తత్వం కావచ్చు. అంతమాత్రాన నువ్వు విచ్చలవిడిగా ఖర్చు చేయటానికి నేనొప్పుకోను..' నొసలు చిట్లించి గుర్రుగా చూశాడు.

'మీరున్నారే... ఈ జన్మకు మారరుగాక మారరు!. మీవంటి పిసినారి మొగుడు ఎవరికీ వుండడు ఈ ప్రపంచంలో..'

'అబ్బఛా! నన్ను బాగానే 'స్టడీ' చేశావ్...'

'కాకపోతే ఏంటండీ?- మా అమ్మనాన్నను ఎట్లాగూ గడప తొక్కనీరు... ఒక్కపూట పిల్లనిచ్చిన వారికి తిండి పెట్టాల్సివస్తే ఏడుపు... మీ పేరెంట్స్... తోడ పుట్టిన వాళ్లొచ్చినా ఒక్క పూటకు మించి వాళ్లను ఉండనియ్యరు.... ఏ మొగుడికి ఇంత కమర్షియల్ మైండ్ వుండదండీ...'

'సరే నాకుంది! అయితే ఏంటంట?- నేనింతే.. అంతమాత్రాన నేను నచ్చలేదని ఎవడితోనైనా వుడాయిస్తావా? జంపై పోతావా?- నువ్వు ఎస్సనాలే గానీ... ఎవరైనా నిన్ను ఎగేసుకుపోతారు...'

'చాల్లే ఆపండి! పి.జి. చదివారు. సంస్కారం లేదు. కట్టుకున్న భార్యతో ఇలాగేనా మాట్లాడేది?- ఎవరైనా వింటే ముఖాన ఉమ్ముతారు... మీరిలాగే వుంటే... మాటల్తో కుళ్ల పొడుస్తుంటే... నేను చచ్చిపోతాను...'

'ఆహాఁ!... అలాగా!... ఎలా చస్తావ్?

'ఏనూతిలోనైనా నాదూకుతాను...'

'ఈరోజుల్లో ఇళ్లల్లో బావులెక్కడున్నాయ్?-'

'చెరువులో దూకుతాను..'

'నీకు తెల్సో లేదో? చెరువులన్నీ కబ్జాలకు గురై అపార్ట్‌మెంట్స్

వెలుస్తున్నయ్...'

'సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంటాను...'

'మనింట్లో అవీ లేవు... అన్ని గదులకు ఎ.సి. ఫిట్ చేయించా కదా...?!'

'ఇవేవీ కాకపోతే ఇంత విషం తెచ్చుకుని హరీ అంటాను. సరేనా?!..'

'హరీ అంటావో' హరహరా అంటావో?- ఇదంతా కాదుగానీ... నేటి నుంచి ఉపవాసాలుండు. నిరాహారదీక్ష ప్రారంభించు! క్షీణించి క్షీణించి కడకు ఊపిరిపోతుంది...'

'ఏంటీ? వెటకారమా?...'

'కాదా మరి...'

'ఏదీ కొనకూడదు... తినకూడదు... ఏపనీ చెయ్యనీవు... డబ్బు ఖర్చు కాకూడదు... ఎట్లాగయ్యా నీతో చచ్చేదీ?-' నిష్ఠూరంగ మాట్లాడాను.

'బతికి సాధించాలే పిచ్చి మొహం'మా!... నీకు ఇలాంటి పిచ్చి పిచ్చి ఆలోచనలు ఎలా వస్తాయ్ అంటే... బేవార్స్ ఆలోచనల్ల మాట! బుర్ర వుంది కదాని... ఆలోచనల్లు పైసా ఖర్చు లేకుండా 'ఓసీ'గా రాకూడదే....'

'ఏం చేస్తాను? అన్నీ వుండీ... (అల్లుడి నోట్లో కాదు) పెళ్లాం సుఖపడే రాతలేదంటే ఇదే మరి. ఏం చేస్తాం? అంతే తలరాత నా తుగ్లక్ మగడా...'

'నన్ను చూడుమరి... కానీ కట్నం తీసుకోకుండా నిన్ను 'ఓసీ'గా పెళ్లాడానా?... 'ఓ.సీ'గా నీతో కాపురం చేస్తున్నానా!?... పైసా ఖర్చు పెట్టకుండా అన్నీ ఓ.సీ.గా వస్తుంటే... హేపీగా ఎంజాయ్ చేయటమే లైఫ్... కాబట్టి... ఇకనుంచి నో మేకప్... నో గోయింగ్ పిక్చర్స్... నో షికార్స్... నో డిన్నర్స్ అవుట్ సైడ్... అండర్‌స్టాండ్!!....'

'అయ్యో నా మొగడా!... అర్థం కాక చస్తుందా?!- మొగుడు తిక్కలోడు... తుగ్లక్ అయితే ఇలాగే ఏడుస్తుంది సంసారం...' నాలుగు శాపనార్థాలు పెట్టి కిచన్లోకి నడిచాను.

'నైట్‌కి రెండు ఫుల్కాస్ నో కర్రీస్... నోరైస్... విన్పించిందా?!-'

నా మొగుడి మాటలు కర్ణపేయంగ విన్పించినయ్ దూరంగా కిచన్లో వున్నా....

(సమాప్తం)